సాక్షి
వికారాబాద్
సోమవారం : 22 : మే : 2023



దడపుట్టిస్తున్న దారి

కంకర తేలిన ఎన్కెపల్లి లింకు రోడ్డుపై వెళ్లాలంటేనే ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. ఏళ్లుగా అవస్థలు తప్పడంలేదు. 8లో▸



సరిహద్దులు దాటుతున్న బియ్యం

ప్రభుత్వ బియ్యం సరిహద్దులు దాటుతోంది. గ్రామాలు, పట్టణాల నుంచి పేదల బియ్యం సేకరిస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. 9లో▸



సేవలు చిరస్మరణీయం

రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంమ్మోహన్‌రెడ్డి అన్నారు. 9లో▸

ఓటరు జాబితా ప్రక్షాళన

పకడ్బందీగా లిస్ట్ తయారీ

- ఓటర్ల వద్దకు వెళ్లి విచారిస్తున్న అధికారులు
- బోగస్ ఓటర్ల ఏరివేత దాదాపు పూర్తి
- డబుల్ ఓట్లపై ప్రత్యేక దృష్టి
- 80 శాతం మేర ఆధార్ అనుసంధానం
- నిరంతరం కలెక్టర్ పర్యవేక్షణ
- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,01,623



వికారాబాద్: అధికారులు ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టి సారించారు. బోగస్ ఓటర్ల ఏరివేతకు చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. ఆయా కారణాలతో ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్లపై విచారణ జరుపుతున్నారు. 2022 జనవరి నుంచి 2023 జనవరి వరకు జిల్లాలో 36 వేల ఓటర్లను ఆయా కారణాలతో తొలగించారు. ఇదే సమయంలో 40 వేల కొత్త ఓటర్లు నమోదయ్యాయి. మొత్తానికి ఏడాది కాలంలో ఓటర్ల సంఖ్య తొమ్మిది లక్షలకు అటుఇటుగా కొనసాగుతోంది. పెద్ద మొత్తంలో ఓటర్లను జాబితానుంచి తొలగించడంపై అనుమానాలు వ్యక్తం చేసిన కలెక్టర్ మరోసారి ఇంటింటికీ వెళ్లి విచారణ జరపాలని తహసీల్దార్లు ఇతర యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. ఆరు నెలల క్రితం ప్రారంభమైన ఆధార్ సీడింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడటంతో పాటు ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కల్పోకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇటీవల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ ఓటరు జాబితా తయారీ విషయంలో పలు సూచనలు చేశారు.

ఓటర్ల సహకారం లేకే..

ఎక్కువ మంది డబుల్ ఓటర్లు నమోదు ఉన్నందునే వారు ఆధార్ కార్డులు ఇచ్చేందుకు సహకరించక ప్రక్రియ మందగించినట్లు తెలుస్తోంది. అయితే అనుసంధానం ప్రక్రియలో భాగస్వాములైన యంత్రాంగం ఇతర పనుల్లో నిమగ్నమవడం కూడా మందగించటానికి కారణమని ఉద్యోగులు పేర్కొంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్తున్న బీఎల్ఓలు ఆధార్ సీడింగ్ చేశారు. ఇళ్ల వద్దకు వెళ్లే సమయంలోనే ఓటర్ల అభిప్రాయం సైతం తీసుకుంటున్నారు. ఒకే వ్యక్తికి సంబంధించి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో పేర్లు నమోదై ఉంటే ఎక్కడ ఉంచాలి? ఎక్కడ తొలగించాలనే విషయంలో ఓటర్ల నిర్ణయం మేరకే వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దీంతో పాటు వారి ఆధార్ కార్డులు సైతం బీఎల్ఓలు సేకరిస్తున్నారు. ఇదే సమయంలో కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామాలు, బూత్‌ల వారీగా ఆధార్ అనుసంధానం ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం ఆధార్ అనుసంధానం పూర్తయ్యింది. ఈ ప్రక్రియ పూర్తయితే పూర్తిగా బోగస్ ఓటర్లు తొలగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే కొంత కాలంగా ఆధార్ అనుసంధానం నిలిపి వేసినట్టు సమాచారం.

80 శాతం ఆధార్ అనుసంధానం పూర్తి

జిల్లాలో ఆధార్ అనుసంధానం ప్రక్రియ ఆరు నెలలుగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 80 శాతం ఓటర్లను ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. మరో 20 శాతం పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం గత జనవరి తుది జాబితా ప్రకారం 4,51,134 పురుషులు, 4,49,945 స్త్రీలు 24 మంది ట్రాన్స్ జెండర్స్‌తో మొత్తం 9,01,103 ఓటర్లు ఉన్నారు. ఎన్ఆర్ఐ, సర్వీస్ ఓటర్లు మరో 499 ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 6,99,771 మంది ఓటర్లకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి చేశారు. ఇంకా 1,83,770 ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉంది. కొడంగల్, దౌల్తాబాద్ మండలాలు 92 శాతానికి పైగా ఆధార్ అనుసంధానంలో ముందు వరుసలో ఉండగా కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి, పూడూరు, బొంరాస్‌పేట్ మండలాలు 72 శాతంతో వెనకంజలో ఉన్నాయి.

వేలల్లో బోగస్ ఓటర్లు..

బోగస్ ఓటర్లు వేలల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో రెండు అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు వేలల్లో ఉండే అవకాశం ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అధార్ అనుసంధానం ప్రక్రియ వందశాతం పూర్తయితేనే ఎంత మంది ఓటర్లను తొలగించారనే విషయంలో స్పష్టత రానుంది. చాలా వరకు ఓటర్లు తమ పేర్లను గ్రామాల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవటంతో పాటు వారే మళ్లీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పాలక సంస్థలలో నమోదు చేసుకుంటూ వస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవటం కోసం ప్రధానంగా పట్టణాల్లో తమకు అనుకూల గ్రామీణ ఓటర్ల పేర్లను రాయించి గెలుపోటములను సైతం శాసిస్తున్నారు. ఒక్కరు కూడా ఓటరు జాబితా నుంచి కారణంలేకుండా తొలగించకూడదు. ఒక్కరు కూడా తమ ఓటు హక్కును కోల్పోవద్దన్నదే ప్రధాన ఉద్దేశం కావాలని అధికారులకు తాజాగా నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సూచించారు.

న్యూస్‌రీల్

కార్యకర్తలు అధైర్యపడొద్దు

- ఆపదవస్తే ఆదుకుంటాం
- ఎంపీ రంజిత్‌రెడ్డి



చికిత్సపొందుతున్న సుభాన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

వికారాబాద్ అర్బన్: ఆపద వచ్చిందని కార్యకర్తలు అధైర్య పడొద్దని వారిని కడుపులో పెట్టుకొని చూసుకుంటామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. ఇటీవల వికారాబాద్ సమీపంలో ప్రమాదానికి గురై సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు సుభాన్‌రెడ్డిని ఆదివారం ఎంపీ పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులతో అతనికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. అతని కుటుంబ సభ్యులను కలిసి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సుభాన్ వైద్య ఖర్చులకయ్యే రూ.8లక్షలను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు తాను ఎల్లపుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

బంట్వారం: తెలంగాణ మోడల్ స్కూల్స్, కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు బంట్వారం ప్రిన్సిపాల్ సరళారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఆంగ్ల మాధ్యమంలో ప్రతి గ్రూపులో 40 చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25లోపు టీఎస్ మోడల్ స్కూల్స్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఫీజు లేకుండానే ఆన్‌లైన్‌లో ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న సర్కార్

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాండు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు

అనంతగిరి: గ్రామ పంచాయతీ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ.. ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాండు ఆరోపించారు. ఆదివారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఓ 51ని తీసుకువచ్చి కార్మిక చట్టాలను కాలరాస్తుందని విమర్శించారు. కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనట్టయితే ఈ నెల 25 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి రామకృష్ణ, గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు ప్రభుకుమార్, యాదయ్య, భిక్షపతి, అంజయ్య, తిర్మలయ్య, మల్లయ్య, వెంకట్రాములు, గోపాల్, నర్సింహులు, వెంకటయ్య, రాములమ్మ, అనంతయ్య, మొగులయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతికి మూలం ప్రేమే..

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: అన్ని వర్గాలను ప్రేమభావంతో సమానంగా చూసినప్పుడే దేశంలో శాంతి నెలకొంటుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ చైర్మన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సరూర్‌నగర్ స్టేడియంలో జాకబ్ అధ్యక్షతన జరిగిన క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనానికి క్రిస్టియన్ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రేమే సృష్టికి మూలమని, యేసుప్రభు ప్రపంచానికి ప్రేమను పంచారని తెలిపారు. క్రీస్తు బోధనలు మైమరిపిస్తాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలవారిని సమానంగా గౌరవిస్తోందని చెప్పారు. దైనందిన జీవితంలో తోటివారిపై సోదర, ప్రేమ భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు ఎం.ప్రసాద్, డా.కే.సిన్హా, కే.మోజెస్, శంకర్‌లుక్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

గ్రామాల ప్రగతి పనులు వేగిరం చేయండి

- పారిశుద్ధ్యంపై అశ్రద్ధ తగదు
- డీపీఓ తరుణ్‌కుమార్



పెద్దనందిగామలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

కొడంగల్ రూరల్: గ్రామాల ప్రగతి పనులు వేగిరం చేయాలని, పారిశుద్ధ్యంపై అశ్రద్ధ చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, తాండూరు డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దనందిగామ, హుస్సేన్ పూర్ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపోస్టు షెడ్డులో తడి, పొడి చెత్త వేర్వేగా వేయిస్తూ వర్మీ కంపోస్టు తయారుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని తెలిపారు. చిట్లపల్లి, చిన్ననందిగామ, ఇందనూర్ తదితర గ్రామాల్లోని వైకుంఠధామం, నర్సరీ, ఇంకుడుగుంతలు తదితర వాటిని పరిశీలించారు. ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం పనులు చేయించడం లేదనే క్రమంలో హుస్సేన్‌పూర్, పెద్దనందిగామ పంచాయతీ కార్యదర్శులు మల్లప్ప, కొండయ్యలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రాములు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

- కొటాలగుడెంలో వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన
- హాజరైన సంత్ శేఖర్ మహరాజ్
- అందరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఉద్బోధ

అనంతగిరి: వికారాబాద్ మండలం కొటాలగూడెంలో జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాంతి పాఠం, అవాహిత దేవతాపూజ, మహస్నపనం తదితర కార్యక్రమాలు గావించారు. హోమాలు చేపట్టారు. అనంతరం మంగళ హారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహారాష్ట్ర పొరఘడ్ పీఠం ప్రతినిధి సంత్ శేఖర్ మహరాజ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దైవ చింతన అవసరమన్నారు. భక్తితో ఏదైనా సాధ్యమన్నారు. అందరం సన్మార్గంలో నడవాలని, సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో పయనించాలన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు నాయక్, మాజీ సర్పంచ్ రాఘవన్ నాయక్, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంత్ శేఖర్ మహరాజ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, మాజీసర్పంచ్‌లు

రేషన్ డీలర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: రేషన్ డీలర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రేషన్ డీలర్లకు సరిపడా కమీషన్, హెల్త్ కార్డులను జారీ చేయాలని ఆదివారం రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకపాత్ర డీలర్లదేనన్నారు. సీఎం కేసీఆర్ అందరి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మా పాలనలోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు
- నిధులు, నియామకాలన్నీ కేసీఆర్ కుటుంబానికే
- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



నిరుద్యోగ డిక్లరేషన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామ్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు

కుల్కచర్ల: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిరుద్యోగ డిక్లరేషన్ వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు, నీళ్లు, నియామకాలు సాధించే సంకల్పంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తే ప్రస్తుత పాలకులు వారి కుటుంబానికి డబ్బులు సంపాదించుకునేందుకు ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాలలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో యువత తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిందేనన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనండి

ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ ఆధ్వర్యంలో జూన్ 2న వివిధ అంశాలపై ఆన్‌లైన్ క్విజ్‌ను నిర్వహిస్తున్నారని రామ్మోహన్ రెడ్డి తెలిపారు. క్విజ్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందిస్తామన్నారు. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనేవారు 76618 99899 అనే నంబరుకు మిస్డ్‌కాల్ ఇస్తే లింక్ వస్తుందని, తద్వారా ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాకు అధ్యక్షులు భరత్‌కుమార్, ఎంపీటీసీ ఆనందం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వైపే ప్రజల మొగ్గు

పరిగి: బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెందారని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. పూడూరు మండలం చింతల్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం టీఆర్ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అటు యువతను ఇటు రైతులను నిలువునా ముంచారన్నారు. మాయమాటలను చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఇక ఆయన మాటలు ఎవరూ నమ్మే స్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్‌ముదిరాజ్, వివిధ మండలాల నాయకులు శ్రీనివాస్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధికి రాజీవ్ పునాది

- పేదల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారు
- ఆర్ఆర్ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

తుక్కుగూడ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని ఆర్ఆర్ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం తుక్కుగూడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రాజీవ్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. దేశంలో సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయనే పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంపన్న యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానకిరామ్, శివగల్ల యాదయ్య, బాకీ నవీన్, కప్పల రాజు, బ్యాగరి మహేందర్, సునీల్, పాండు రంగారెడ్డి, దర్శన్, యాదగిరి,రాజ్ కుమార్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమలేశుడి సన్నిధిలో ఎమ్మెల్యే



తిరుమల కొండపై ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

కొడంగల్ రూరల్ : ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆదివారం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరిపై శ్రీనివాసుడి ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించేలా ఆశీర్వదించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు షాబాద్ జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, కుటుంబసభ్యులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.

లారీని ఢీకొన్న బైక్, ఒకరి మృతి



ప్రతాప్‌సింగ్ (ఫైల్)

కొడంగల్ రూరల్: ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చిట్లపల్లి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దోమ మండలం గంజిపల్లికి చెందిన ప్రతాప్‌సింగ్(50), హన్మాన్‌సింగ్ ఇద్దరు అన్నదమ్ములు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలో బంధువుల వివాహ వేడుకకు హాజరై తిరుగు పయనమయ్యారు. చిట్లపల్లి–అయినన్‌పల్లి గ్రామాల మధ్య ఆగి ఉన్న లారీని వారి బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రతాప్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మృతుడి అన్నకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108వాహన సిబ్బంది ప్రతాప్‌సింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హోటల్ దగ్ధం



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఓ హోటల్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల మల్లికార్జున హోటల్, టిఫిన్ సెంటర్‌లో శనివారం రాత్రి యథావిధిగా హోటల్ మూసివేశారు. తీరా ఆదివారం ఉదయం వచ్చి చూడగానే హోటల్ దగ్ధమయ్యింది. హోటల్ సామగ్రితో పాటు, ఇంటికి సంబంధించిన వస్తువుల సైతం పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 4లక్షల వరకు తనకు నష్ట వాటిల్లిందని ఆయన తెలిపారు. ఈమేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

భక్తిభావాలతో మానసిక ప్రశాంతత

శంకర్‌పల్లి: ఆకుపచ్చ మరఖత శివ లింగాలు చాలా అరుదుగా ఉంటాయని జబర్దస్త్ నటుడు రాకేశ్ (రాకింగ్) అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా చందిప్పలోని మరఖత శివాలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజ, అభిషేకం చేయించారు. భక్తిభావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఆలయ చైర్మన్ సదానందం, కమిటీ సభ్యులు, పూజారులు అతన్ని శాలువాతో సన్మానించారు.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం నుంచి జరుగనున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన సీఎం కప్ పోటీలు 2వ దశకు చేరుకున్నాయన్నారు. 33 జిల్లా కేంద్రాలలో ప్రారంభమయ్యే పోటీలకు స్థానిక జిల్లా మంత్రులు, శాసన సభ్యులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని తెలియజేశారు. స్థానిక జిల్లా కలెక్టర్లు చైర్మన్‌గా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

దడపుట్టిస్తున్న దారి



కంకర తేలిన ఎన్కెపల్లి లింకు రోడ్డు

అధ్వానంగా ఎన్కెపల్లి లింకురోడ్డు

- దారంతా తేలిన కంకర
- వాహనదారుల బెంబేలు
- ఏళ్లుగా అవస్థల ప్రయాణం
- పట్టించుకోని పాలకులు

బంట్వారం: కంకర తేలిన ఎన్కెపల్లి లింకు రోడ్డుపై వెళ్లాలంటేనే ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా తయారైంది. జిన్నారం గేటు నుంచి ఎన్కెపల్లి మీదుగా బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారం వెళ్లే వారికి దగ్గరిదారి. ప్రస్తుతం రోడ్డు బాగా లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు దూర ప్రాంతం నుంచి చుట్టూ తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఎన్కెపల్లి లింకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి సమస్య అలాగే ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర తేలిన ఈ రోడ్డు పై రాత్రి వేళ ప్రయాణం మరీ నరకమే.

సగం వరకే పనులు..

కంకర తేలిన ఈ లింకు రోడ్డుకు ఎనిమిదేళ్ల కిందట సగం వరకే మెటలింగ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో అప్పట్లో బడ్జెట్ ఉన్నంత వరకే పనులు చేశారు. మిగతా సగం పనులు అలాగే పెండింగ్‌లో ఉండిపోయాయి. అప్పట్లో మెటలింగ్ చేసిన సగం పనులు కూడా మళ్లీ మొదటికొచ్చాయి. ప్రసుత్తం కంకర తేలి కాలి నడకన కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా ఎన్కెపల్లికి సకాలంలో చేరుకోవడం లేదు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యను పలు సార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ అధికారులు సత్వరమే స్పందించి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు పంపిస్తాం

మెటిలింగ్‌తో పాటు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేయాలి. త్వరలోనే రోడ్డును పరిశీలిస్తాం. రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడుతాం.

– జితేందర్‌రెడ్డి, డీఈ, పీఆర్

మంత్రిని కలిసిన వడ్డెర సంఘం నేతలు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలకు వడ్డెర సంఘం కమ్యూనిటీ భవనాల మంజూరుకు మంత్రి సబితారెడ్డి హామీ ఇవ్వడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకార్యదర్శి, మీర్‌పేట కార్పొరేటర్ వేముల నర్సింహా ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. నియోజకవర్గంలో దాదాపు 28 వేలకు పైగా జనాభా కలిగి ఉన్న వడ్డెరులు నేటికీ సొంత ఇల్లు లేకుండా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం అందజేసే డబుల్ బెడ్‌రూం పథకంలో వడ్డెరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు వరికుప్పల శ్రీశైలం, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు అశోక్, మంజల నగేష్, కార్యదర్శి వరికుప్పల వెంకటేష్, పల్లపు శంకర్, జిల్లా నాయకులు డేరంగుల నర్సింహా, గండికోట యాదయ్య, మాగని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ ఉషారాణి



తలకొండపల్లి: ఫెర్టిలైజర్స్ షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, ఎస్‌ఓటీ అధికారులు

తలకొండపల్లి: ప్రభుత్వం సూచించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను విక్రయించాలని వ్యవసాయ కమిషనరేట్ ఆఫీస్ ఏడీఏ ఉషారాణి అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల షాపులను ఆమె ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, సీడ్ సర్టిఫికేషన్ అధికారి కె.నరేష్‌లతో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ధరల పట్టిక, స్టాక్, నిల్వ, తదితర రిజిష్టర్‌లు, రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు ఖచ్చితంగా రశీదులు ఇవ్వాలన్నారు. రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు రశీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఎమార్పీ ధరల కంటే విక్రయించినట్లు రుజువైతే సదరు యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలకు సంబంధించిన గోదాంలు, స్టాక్‌లు, ఇన్వాయిస్‌లు, రిజిష్టర్‌లను తనిఖీ చేసి హెచ్‌టీ కాటన్ విత్తనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌టీం సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ ఉషారాణి హెచ్చరించారు. పట్టణంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం, సూర్య అగ్రి షాప్, శ్రీ మహీంద్రా ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్, వాసవి ఫర్టిలైజర్స్, నాగార్జున ఆగ్రో కెమికల్స్ తదితర ఎరువుల దుకాణాలలో ఆదివారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌టీం బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం బృందం సభ్యులు, ఏడీఏ ఉషారాణి, శంషాబాద్ ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ అధికారి నగేశ్‌లు ఆయా షాపులలో ఉన్న రిజిస్టర్లు, స్టాకు, విత్తనాలను తనిఖీ చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్తి విత్తనాలలో హెర్బిసైడ్ టాలరెంట్ జన్యువు ఉందా లేదా అని పరీక్ష చేశారు. విత్తనాలకు సంబంధించిన రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌ల బిల్లులు తదితర వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, సిబ్బంది ఉన్నారు.

బైక్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

శంకర్‌పల్లి: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగాపురం శివారు కంది– షాద్‌నగర్ మార్గంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావులపల్లి కలాన్‌కు చెందిన ప్రవీణ్(28) అబులెన్స్ వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి ఒంటిగంటకు శేరిలింగంపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా సింగాపురం శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈసమయంలో తలకు బలమైన గాయం కావడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శునకానికి భయపడి.. మూడో అంతస్తు పైనుంచి దూకి..

- తీవ్రంగా గాయపడిన డెలివరీ బాయ్
- ఆసుపత్రికి తరలింపు



ఇలియాజ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మణికొండ: డెలివరీ పార్సిల్‌ను అందించేందుకు వచ్చిన ఓ యువకుడు...పెంపుడు కుక్క అరవడంతో భయపడి అపార్టుమెంట్ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. దీంతో తీవ్రగాయాలపాలవగా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలోని శ్రీనిధి హైట్స్ అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో అద్దెకు ఉంటున్న నీలారాణి మూడు రోజుల క్రితం అమెజాన్‌లో పరుపు(బెడ్)ను ఆర్డర్ చేసింది. దాంతో ఆదివారం దాన్ని తీసుకుని డెలివరీ బాయ్ ఇలియాజ్ వారి ఇంటికి లిఫ్ట్‌లో వచ్చాడు. అతను తెచ్చిన బెడ్‌ను తలుపు తెరచి ఉండటంతో ఇంట్లోకి నేరుగా వచ్చి హాల్‌లో వేశాడు. దాని చప్పుడుకు ఇంట్లో ఉన్న లాబ్ జాతి కుక్క ఒక్కసారిగా అరవటంతో అతను భయపడి పోయాడు. ఆ సమయంలో కుక్క ఎక్కడ కరుస్తుందో అనే భయంతో ఏకంగా మూడవ అంతస్తు బాల్కనీ నుంచి కిందకు దూకాడు. నేరుగా అపార్ట్‌మెంట్ ప్రహరీగోడపై పడటంతో నడుము భాగంలో గాయమయ్యింది. దీంతో నీలారాణి భర్త డాక్టర్ సుబ్బరామిరెడ్డి సపర్యలు చేసి 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి పంపారు. డెలివరీ బాయ్ ఉదయం ఫోన్ చేసి ఈరోజు డెలివరీ చేస్తామని చెప్పాడని, వచ్చే ముందు ఎలాంటి ఫోన్ చేయటం, ఇంటి ముందుకు వచ్చి బెల్ కొట్టడం చేయలేదని, నేరుగా ఇంట్లోకి రావడం వల్లే కుక్క అరిచిందని నీలారాణి తెలిపారు. బాధితుడు తన అన్నకు ఫోన్ చేయటంతో ఓవైసీ ఆసుపత్రికి తీసుకుని రావాలని చెప్పటంతో 108 సిబ్బంది అతన్ని అక్కడకు తరలించినట్టు సమాచారం. రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సమాచారం సేకరించారు.

సంక్షేమంలో నంబర్ వన్

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

- అన్నిరంగాల్లో దూసుకుపోతున్న తెలంగాణ
- సీఎం కేసీఆర్ శ్రమకు ఇదే నిదర్శనం
- మంత్రి సబితారెడ్డి



సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ కష్టానికి ఇదే నిదర్శనమని తెలిపారు. రూ.64 లక్షల నిధులతో మహేశ్వరంలో నిర్మించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనాన్ని ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, ప్రతీ ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున రైతుబంధు అందిస్తున్న ఏకై క ప్రభుత్వం కేసీఆర్‌దేనని తెలిపారు. రైతుబీమా అనేక కుటుంబాలకు ధీమాగా నిలుస్తోందని స్పష్టంచేశారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తూ.. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. మహేశ్వరంలో రూ.1.40 కోట్లతో నూతన మార్కెట్ కమిటీ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ, షెడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండుర్గు రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మహేశ్వరం కోపరేటివ్ బ్యాంకు మేనేజర్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ షఫి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్ పలువురు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ ప్రారంభం

బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఉప్పుగడ్డతండాలో ఆదివారం బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మహేశ్వరంలో రూ.4 కోట్లతో సంత్ సేవాలాల్, దుర్గమ్మ ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. యాదాద్రి ఆలయ నిర్మాణానికి వాడిన శిలారాయినే వీటికి వాడుతున్నామని చెప్పారు. కేసీతండాలోని కొత్వాల్ చెరువు కట్టపై 40 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని స్పష్టంచేశారు. స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతానాయక్, బీఆర్ఎస్ నాయకులు లచ్యానాయక్, కూన యాదయ్య, అంగోత్ రాజునాయక్, నేనావత్ ఈశ్వర్‌నాయక్, సర్పంచ్‌లు ఎం.రాజునాయక్, శివినాయక్, మోతిలాల్ నాయక్, నేజీరెడ్యా నాయక్, సాలీ నాయక్, హర్షగూడ ఎంపీటీసీ విజయ్ నాయక్, బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: కాలనీల్లోని సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

షాద్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 20, 21 వార్డుల్లో ఎమ్మెల్యే బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బస్తీబాట కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తద్వారా పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, మాజీ చైర్మన్ విశ్వం ,సరిత, యాదగిరి, జీటీ శ్రీనివాస్, రవియాదవ్, రఘునాథ్ యాదవ్, శంకర్, భిక్షపతి, నరేష్, నర్సింలు యాదవ్, జంగరాజ్, సంతోష్, అశోక్ యాదవ్, ఖాజా, వెంకటేష్ యాదవ్, మహేష్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

కొందుర్గు: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. జిల్లా కోఆపరేటీవ్ మార్కెటింగ్ సొసైటీ ద్వారా కొందుర్గు మండల కేంద్రంలో మంజూరైన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలు రైతులకు అందేలా చూడాలని తెలిపారు.

అందని పశువైద్యం



తాళ్లపల్లిలో మూత పడిన పశువైద్య ఉపకేంద్రం

వేధిస్తున్న సిబ్బంది కొరత

- అందుబాటులో ఉండని మందులు
- అవస్థల్లో పశుపోషకులు, రైతులు

షాబాద్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. అస్వస్థతకు గురైన జీవాలను పశు వైద్యశాలకు తీసుకెళ్తే మందులు అందుబాటులో లేవంటున్న సిబ్బంది, బయట కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఐదారేళ్లుగా ఇదే దుస్థితి నెలకొందని పశుపోషకులు మండిపడుతున్నారు. ముఖ్యంగా పలు రోగాల బారిన పడి గొర్రెలు, మేకలు పెద్ద సంఖ్యలో మృతిచెందుతున్నాయని చెబుతున్నారు. మూడు నెలలకోసారి మందులు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో వీటిని సక్రమంగా వినియోగించడం లేదనే ఆరోపణలున్నాయి. షాబాద్ పశువైద్యశాల పరిధిలో సర్దార్‌నగర్, మాచన్‌పల్లి, బోడంపహాడ్ ఉన్నాయి. ఈ సబ్ సెంటర్లలో అవసరమైన మేర సిబ్బంది లేరు. రేగడిదోస్వాడ పశువైద్యశాల కింద ఉన్న తాళ్లపల్లి, పోతుగల్, చందనవెల్లి పశువైద్యశాలల్లో డాక్టర్లు లేక మూతపడ్డాయి. అటెండర్ల పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. సుమారు ఐదేళ్ల క్రితం అవుట్ సోర్సింగ్ కింద మండలంలో ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను తీసుకుని, వీరితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో పశుపోషకులు, రైతులకు అవస్థలు తప్పడం లేదు. రోగాల బారిన పడిన పశువులను మండల కేంద్రంలోని దవాఖానాకు తీసుకెళ్లాలంటే వాహనం అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. పశువులను వాహనం ఎక్కించడానికి, దింపడానికి కూలీల ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికైనా వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి గ్రామాల్లో పశువులకు వైద్యం అందించాలని పాడి రైతులు, కాపరులు కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



పశు వైద్యశాలలో కొన్ని రకాల మందులే ఉంటున్నాయి. దీంతో ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. సిబ్బంది నియామకం చేపట్టి మందులను అందుబాటులో ఉంచాలి.

– కుమ్మరి సత్తయ్య, పాడి రైతు, తాళ్లపల్లి

ప్రతిపాదనలు పంపాం



సిబ్బంది కొరత వాస్తవమే. కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం మందుల కొరత లేదు.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి రేగడిదోస్వాడ

వ్యాధులతో జాగ్రత్త

మొయినాబాద్, రూరల్: గొర్రెలు, మేకలకు నీలి నాలుక, గెటికల రోగం, గాలికుంటు వ్యాధులు ప్రమాదకరంగా మారాయి. వీటి బారిన పడిన జీవాలు మృతి చెందడంతో కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందస్తు జాగ్రత్తలతో జీవాలను రక్షించుకోవచ్చని మొయినాబాద్ కనకమామిడి, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీలత సూచించారు.

నీలి నాలుక లక్షణాలు

ఈ వ్యాధి ప్రధానంగా గొర్రెలకు సోకుతుంది. పెదవులు, నాలుకకు వాపు వస్తుంది. నాలుక నీలిరంగుకు మారి నోట్లో పుండ్లు ఏర్పాడతాయి. దీంతో నోట్లో నుంచి చొంగ కారుతూ తరచూ జ్వరానికి గురవుతాయి. మేత మేయలేక నీరసించి మత్యువాత పడే అవకాశముంటుంది. నాలుక, పెదవులతో పాటు గెటికలపై భాగం వాపు రావడంతో నడవలేవు.

జాగ్రత్తలే రక్ష



గొర్రెల్లో కుంటు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. నీలినాలుక ప్రభావం పెద్దగా లేదు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే జీవాలను కాపాడుకోవచ్చు. జీవాలకు ఏ సమస్య ఎదురైనా వెటర్నరీ ఆస్పత్రికి తీసుకురావాలి.

– డాక్టర్ శ్రీలత, పశువైద్యాధికారి

నివారణ చర్యలు

- వ్యాధి కారకాలైన దోమల కాటుకు గురి కాకుండా చూసుకోవాలి.
- చీకటి పడిన తర్వాత, వేకువ జామున మందల పక్కన మంట పెట్టి వేపాకుతో పొగ పెట్టాలి.
- చెరువులు, కుంటలు, నీటి నిల్వ ప్రదేశాల్లో మందలను ఆపరాదు.
- వైద్యుల సలహా మేరకు ఆక్సిటెట్రిసెట్లాన్ పౌడర్ లేదా సిప్రోఫాక్సెసిన్ పౌడర్‌ను కాచి చల్లార్చిన నీటిలో కలిపి రెండు నుంచి మూడ్రోజులు జీవాలకు తాపాలి.



కేతిరెడ్డిపల్లిలో మేకల మంద...

గెటికల వ్యాధి లక్షణాలు, నివారణ

- చౌడునేల, ముళ్లల్లో గొర్రెలను నడిపించడం వల్ల గిట్టలకు గాయాలు ఏర్పడి పుండ్లు తయారవుతాయి.
- వర్షాల వల్ల పుండ్లు తొందరగా తగ్గక గెటికలు వాచి చీముకారుతుంది. జీవాలు నడవలేవు.
- ఒక శాతం ఫార్మాలిన్ రసాయనం నీటిలో కలిపి గెటికెలకు అద్దాలి.
- గెటికలపై పుండ్లు ఏర్పడితే రెండు రోజులకోసారి పొటాషియం పర్మాంగనేట్‌తో గిట్టలను కడగాలి.
- బోరిక్‌పౌడర్, గ్లిజరిన్ కలిపి గిట్టలకు అంటించాలి.